18022024-MAI-04_Layout 1 2/18/2024 2:23 AM Page 1



# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



## తుట్టికి పావుసేరు

ఆగమాగమై బూగ లెక్క
ఎగురుతున్న మనసుకు
మనసున వట్టక
మూడు సేర్ల బీర్లు తాగిచ్చి
ఎండిపోయిన బోర్ల కాడ
బోర్ల బొక్కల పండి
బండబారిన భూమిని గెలికిచ్చి
సెమటసుక్కల తోటి తడిపి
సేసిన మట్టి ముద్దలను
పట్ట పగ్గాలు లేకుంట
పట్టపగలే కనిపిచ్చిన
సుక్కల మీదికి ఇసిరి
రోకు లేకుంట రోఖ మీద
దస్కత్ ఒత్తి
ఇంటిది అద్దగంట పోరువెట్టి
అద్దన్న గానీ
ఐదు సొప్పున అందుకున్న రకం
ఈ రకంగ ఆంబుక్క అయితే
ఆ దిమాకుల
ఎన్ని తీర్ల ఎరువులేసినా
పొలం ఎలుగకపాయే..
నొసలు నొగలు నగలు
అన్నీ కట్టగట్టుకొని ఎక్కిరిత్తే
పుకిలిచ్చి ఊంచాలన్నా
నోటికి పదన పట్టకపాయే..
ఉన్న పది గుంటలు
గుంట నక్కల పాలాయే..
ఎర్కున్న పనే బర్కతుంటదని
దోతి మీదికి కట్టి
పరాయి భూమిల
కిరాయి ఎవుసం జేత్తే
తుట్టికి పావుసేరే..
గీ మట్టి బతుకులు
ఎట్టికి బతుకుడేనా?



అల్లాడి శ్రీనివాస్
83416 63982

# గజల్ ఆవిర్భావం - వికాసం

*తెలుగు ఆధునిక సాహిత్య ప్రక్రియ గజల్. ఇది ప్రేమ భావనలను అందమైన భాషలో, అద్భుతమైన చమత్కారంతో చెప్పే ఒక సుకుమారమైన సాహిత్య ప్రక్రియ. గజల్ ఒక అందమైన సాహిత్య రూపం. ఉర్దూలో తప్ప మరే ఇతర భాషల్లో ఇమడని అద్భుత నిర్మాణ సౌందర్యాత్మక, రసాత్మక సాహిత్య ప్రక్రియ. అందుకే అనేక దేశాల కవులను ఆకర్షించింది, అనుశీలింపజేసింది, అనుకరింపజేసింది. కవుల కలాల్లో సరికొత్త అభివ్యక్తి రూపంగా ఆవిర్భవించింది.*



*గజల్ పఠన యోగ్యమే కాదు, గాన యోగ్యమైన ప్రక్రియ కూడా. పర్షియన్ కవులు ఖసీదా అనే సాహితీ ప్రక్రియ ద్వారా గజల్‌ను వెలుగులోకి తీసుకొచ్చారు. పూర్వం అరేబియాలోని కార్మికులు రాత్రివేళల్లో సరదాగా తమ నాయకున్ని కీర్తిస్తూ ఖసీదాలను పాడేవారు. వాటి నుంచి పరిణామం చెందినదే గజల్. ఖసీదా నుంచి సర్వ లక్షణ సమన్వితంగా, నిర్మాణ బంధురంగా, ఛందో శిల్ప సౌందర్యంగా, అభివృద్ధి సుందరంగా, పరిణామం చెందిన అందమైన అంతర్జాతీయ సాహిత్య ప్రక్రియ గజల్.*

ఇరాన్‌లో ఇది 10వ శతాబ్దంలో ప్రారంభమైంది. 12వ శతాబ్దంలో ముస్లిం రాజుల ప్రాబల్యంలో మొఘలులు.. ఇరానీల ఆచార వ్యవహారాలతో పాటు గజల్‌ను మన దేశానికి దిగుమతి చేశారు. ఇది మొదట అరబ్బీలో నుంచి పర్షియాలోకి వచ్చింది. అటుపిమ్మట ఉర్దూలోకి ప్రవేశించింది. తర్వాత తెలుగు భాషలోకి వచ్చింది. ఈ విధంగా తెలుగులోకి దిగుమతి అయిన ఇతర భాషా సాహిత్య ప్రక్రియే గజల్.

ఉత్తర భారతదేశంలో అమీర్ ఖుస్రూ మొదటిసారిగా ఉర్దూలో గజల్‌ను ప్రారంభించారు. కానీ, వాస్తవానికి దక్కన్‌లోనే మొదట గజల్ ప్రారంభమైందని పరిశోధకుల అభిప్రాయం. తెలుగులో గజల్ రచన గత శతాబ్ది మధ్యకాలంలో దాశరథితో మొదలై సినారెతో కళాత్మక గతిలో మధురస్మృతిలో సాగింది. గజల్స్ పాడితే బాగుంటాయి. గజల్ గానాన్ని గజల్ సరాబు అని అంటారు. సుమారు వందేండ్ల కిందటే గుజరాతీ భాషలో గజల్ రచన ప్రారంభమైంది. పంజాబీ, బెంగాలీ, మరాఠీ, హిందీ భాషల్లోనూ 21వ శతాబ్ది పూర్వార్థంలోనే గజల్స్ రచన ప్రారంభమైంది.

గజల్ మౌలిక వస్తువులైన.. ప్రేమ, దుఃఖం, ధైర్యం, వాంఛ, అవమానం, కరుణ ఇత్యాది భావాలపైనే గజల్ సాగుతుంది. కవి విరహంతో ప్రియురాలి గురించి మధురమైన షేర్లను అశువుగా చెప్పుకొని ఆ బాధ నుంచి స్వాంతన చెందుతాడు. అలా మధురమైన భాషతో, భావంతో హృదయాన్ని తాకే కవిత్వమే గజల్.

> **గజల్ అనగా అరబ్బీ భాషలో రాగాలాపన అని అర్థం. చాలా మంది అంగీకరించిన అర్థమేమిటంటే.. ఇంతులతో మంతనాలు. ప్రియురాలితో సల్లాపం (రహస్య సంభాషణ) అని అర్థం. పార్సీలో గజల్ అంటే మృగనయని (జింక కనులు కలది) అని అర్థం ఉంది. గజల్ ప్రక్రియ శిల్పాన్ని గజలియత్ అని అంటారు.**

గజల్ నియమాల గురించి చెప్పుకొంటే.. రెండు పాదాలను మత్లా అంటారు. తర్వాత రాసే ప్రతి రెండు పాదాలను షేర్లు అని అంటారు. ఈ షేర్లు 5, 7, 9 వరకు ఉండవచ్చు. లేదా అంతకంటే ఎక్కువ అనగా.. 15 వరకూ ఉండవచ్చు. షేర్‌లోని మొదటి పాదాన్ని మిశ్రా అని అంటారు.

ప్రతి పాదాన్ని నాలుగు భాగాలుగా (పదాలుగా) విభజించుకోవాలి. ఈ పదాలలో మాత్రలన్నీ సమంగా ఉండాలి. ఇందులో మూడో పదాన్ని ఖాఫియా అని పిలుస్తారు. ప్రతి షేర్‌లోని మొదటి పాదంలో రదీఫ్, ఖాఫీయాలు ఉండవు. రెండో పాదంలో మాత్రమే ఉంటాయి. మత్లాలోని రెండు పాదాల్లో రదీఫ్, ఖాఫీయాలు ఉండాలి. ఖాఫీయాలోని చివరి అక్షరం లేదా చివరి అచ్చులను రవి అని అంటారు. రెండు మిశ్రాలు ఉంటూ భావైక్యత కలిగి ఉండాలి. ఈ ఖాఫీయాల వల్లనే మెరుపు, వ్యంగం, చమత్కారాలను గజల్ కలిగి ఉంటుంది.

రదీఫ్ అంటే మత్లాలోని రెండు పాదాల్లో చివర ఒకే పదం (ప్రాస) ఉండటం. రదీఫ్ ప్రతి షేర్ చివర రావడంతో గాన యోగ్యంగా, ఇంపుగా ఉంటుంది. రదీఫ్‌లో మాత్రలు తగ్గించుకునే సౌలభ్యం కూడా ఉంటుంది.

గజల్‌లో ఏ షేర్‌కి ఆ షేర్ స్వతంత్రం. భావసాంద్రత ఉండాలి కానీ, వస్తువు ఒకటి కానవసరం లేదు. ఒకటే కూడా తీసుకోవచ్చు. కవి స్వేచ్ఛ, ఇష్టాన్ని బట్టి ఎలా అయినా ఉండొచ్చు.

షేర్‌లన్నింటిలో ఒకే భావం ఉంటే దాన్ని గజల్ ముసల్- సల్ అని అంటారు. గజల్‌కి అతి ముఖ్యమైనవి ఖాఫీయా, రదీఫ్‌లే. ప్రతి షేర్‌లో రెండో పాదంలో చివరి పదంగా మాత్రమే రదీఫ్ (ప్రాస) రావాలి. రదీఫ్ లేని గజల్స్ రాస్తే వాటిని గైర్ మురద్దీఫ్ గజల్ అని అంటారు. ప్రాస అక్షరానికి ముందు హల్లుపై ఒకే అచ్చు ఉండాలి. నాలుగో పదాన్ని రదీఫ్ అని పిలుస్తారు. ఈ రదీఫ్ మత్లాలో రెండు పాదాల్లోనూ, ప్రతి షేర్‌లో రెండో పాదంలోనూ ఉండాలి.

గజల్‌కు గణాలు, శీర్షికలు ఉండవు. గజల్‌లో అన్ని షేర్లు ఒకే అంశం మీద వచన కవిత్వంలా, ఒకే విషయంపై ఉండవు. రాయనవసరం లేదు కూడా. ఏ షేర్‌కు ఆ షేర్ స్వతంత్రంగా, అర్థవంతంగా ఉండాలి. పలు అంశాలపై ఒకే గజల్‌ను కూర్చవచ్చు. ఒకే అంశం మీద కూడా రాయవచ్చు. గజల్‌లో తఖల్లూస్ ఉంటుంది. చివరి షేర్‌లో ఇది ఎక్కువగా వస్తుంది. లేదా వేరే ఏ షేర్‌లోనైనా పెట్టుకోవచ్చు. చివర్లో కవి నామముద్ర (కవి పేరు)గానీ, కలం పేరు గానీ ఉంటుంది. దీన్నే తఖల్లూస్ అంటారు. దీనివల్ల గజల్ ఎవరు రాశారో తెలుస్తుంది.

గజల్‌లో భావవ్యక్తీకరణలో చమత్కారం ముఖ్యం. గజల్‌లో ప్రేమ, విరహం, తాత్వికం ముఖ్య వస్తువులు. గజల్‌కు భక్తిభావం అస్సలు పొసగదు. ఒకసారి వాడిన పదం మళ్లీ వాడకుండా, రాకుండా చూసుకోవడమే గజల్‌కు సౌందర్యాన్ని తెస్తుంది. చమత్కారం గజల్‌కు హృదయం లాంటిది. గజల్ ఛందస్సు బహార్లలో ఉంటుంది. బహార్లను మీటర్ (వృత్తం) అని అంటారు. పార్సీ, అరబ్బీ భాషలలో గజల్స్‌ను బహార్లలోనే రాస్తారు. తెలుగులో మాత్రాఛందస్సులో గజల్స్ ఎక్కువమంది రాస్తున్నారు. బహార్లలో చాలా తక్కువ మంది కవులు రాస్తున్నారు.



సునీత నెల్లుట్ల

### నా గజల్ లహరి

నా మదిలో పల్లవించు భావగీతి నువేకదా!
నవ్వులనే పూయించెడి ప్రేమగీతి నువేకదా!

అనురాగం అల్లుకున్న పరాజిత ఎవ్వరోయి..
చెలరేగిన ఊసులలో భావమంత నువేకదా!

ఆదుకునే హృదయాన అనురాగం పరిమళించె,
జాలి గొలుపు మనసులోన గానమంత నువేకదా!

ముసిముసిగా నవ్వుకుంది
జాబిలమ్మ కొంటెగాను!
చిలిపిపూలు అల్లుకున్న వెన్నెలంతా నువేకదా!

నా పాటకు పురిగొల్పిన పదబంధం నీ చూపే!
'సునీ' ఎదల నిలిచిపోవు ప్రేమంతా నువేకదా!

**గజల్ ఐదు గతులను పరిశీలిస్తే..**


1. త్రిస్రగతి: ఇది 3+3 3+3 3+3 3+3 ఉంటుంది. ఒకవేళ భావం కుదరకపోతే 2+4తో కూడా రాయవచ్చు.
2. చతురస్ర గతి: దీన్ని 4+4 4+4 4+4 4+4తో రాయవచ్చు.
3. మిశ్రగతి: 3+4 3+4 3+4 3+4
4. ఖండగతి: 5+5 5+5 5+5 5+5
5. సంకీర్ణగతి: 4+5 4+5 4+5 ఉండి, చివరి పదంలో ఏడు మాత్రలు ఉండాలి.

**పైన చెప్పిన ఐదు గతులుగా కాకుండా...**

గతి: 6+6 6+6 6+6 6+6 ఇలా కూడా మాత్రలను తీసుకొని గజల్స్ ప్రారంభించవచ్చు. ఇలా గజల్ శిల్పాన్ని చెక్కాలంటే ఎంతో నైపుణ్యం కావాలి. రదీఫ్, ఖాఫీయా నియమాలను పాటిస్తూ, చమత్కారాన్ని జోడిస్తూ నిర్మిస్తే గజల్ ఒక సజీవత్వం ఉట్టిపడే శిల్పంలా ఉంటుంది.

ముఖ్యంగా గజల్ రాయాలనుకున్నప్పుడు ఖాఫీయాలను రూపొందించుకోవాలి. గజల్ రాయాలనే ఇష్టం, పట్టుదల ఉంటే ఈ నియమాలను పాటిస్తూ, మంచి సౌందర్యాత్మకమైన గజల్స్‌ను ఆవిష్కరించవచ్చు. కొత్తగా గజల్స్ రాసే కవులందరూ ఈ నియమాలు పాటిస్తూ చక్కటి గజల్స్‌ను ఆవిష్కరించవచ్చు.

చాలామంది సీనియర్ గజల్ కవులతో పాటు కొత్త కవులు గజల్స్ రాస్తున్నారు. గజల్ కవులు ప్రస్తుతం వందల సంఖ్యల్లో ఉన్నారు. భవిష్యత్తులో ఈ సంఖ్య పెరగవచ్చు. ఈ గజల్ ప్రక్రియ తెలుగులో పరిఢవిల్లాలని ఎందరో కృషి చేస్తున్నారు. వారి కృషి ఎంతో అభినందనీయం.



## నడుస్తున్న చరిత్ర

ఒక కాలాన్ని దహిస్తూ
మరో కాలం
కొత్త పొద్దులా ఉదయిస్తుంది
ఉదయాన్ని ఊహించిన మనసు
సాయంత్రపు సంజెను కలగంటుంది

కళ్ల ముందు ఉన్నదేదీ
దృశ్యమై కనపడదు
మరలి, తరలినదే తర్జుమాలా
నిన్ను వెంటాడుతుంది
మస్తిష్కాన్ని అలజడుల భావజాలాలు
గుమ్మనంగా నిన్ను వేటాడుతాయి

ఒక నమ్మకం
ఒక అమ్మకమై నిలుస్తుంది
భుజాల మీదున్న చేతులు
అనూహ్యంగా అదృశ్యమవుతాయి
నడిచిన దారులు సైతం
కొత్త చీలికల పేలికలవుతాయి
నిలకడగా ఆలోచిస్తే
బుర్రలో పగుళ్లు ఏర్పడుతాయి

వెన్నుపోట్లు వెయ్యి తలల కుబుసమై
సమాజాన్ని నిలువరిస్తుంది
దుమ్మెత్తి పోసుకొన్న చేతులు
అలయ్‌బలయ్‌లతో బంధాన్ని ముడేస్తాయి

కారుకూతల పర్వాల్ని మరచి
చూసే కళ్లకు కనికట్టు కథను చూపిస్తారు
అధికార దాహానికి అన్ని దారుల్నీ తెరిచి
అనూహ్యంగా కుర్చీని అలంకరించి
నడుస్తున్న చరిత్రలో
నాయకులుగా కాక సేవకులుగా మారిపోతారు!



మహబూబ్ బాషా చిల్లెం
95020 00415



## లోపలి నిప్పు

సైన్యాల మధ్య చెలరేగే బదులు
సామాన్యుల మీద విరుచుకుపడి
శవాల పంటకు నారు పోస్తుంది
నిరపరాధుల తలల మీదికెక్కి
నాట్యం చేస్తుంది కసిగా
రక్తదాహంతో రగిలే ఈ రాక్షసికి
అమాయక ప్రాణాలే అన్నపానీయాలు
రెండు పక్షాల మొండితనాన్ని సాకుగా చూపించి
నిస్సహాయతను నటిస్తుంది ఇది!
ఉండుండి గర్జిస్తూ
క్రూరత్వాన్ని కురిపిస్తూ
దుర్భరం చేస్తుంది బతుకుల్ని

అదుపు, అలుపు లేని ఇది
కదనకుతూహల రాగాన్ని ఆలపిస్తూ
ఎన్ని రోజులైనా నడక సాగిస్తుంది
భవనాలు కూలే శబ్దాలే
పక్కవాద్యాల ప్రతిధ్వనులు దీనికి!

కళ్లెం లేని ఓ గుర్రమా!
దౌడు ఆపడం మీద ధ్యాస పెట్టు
పచ్చని బతుకుల శోభలను
నీ గిట్టలతో నేలమట్టం చేయకు
ప్రజా సంక్షేమానికి సమాధి కట్టకు



ఎలనాగ


# అపురూప పద్యగేయ కావ్యం

*వల్లభాపురం జనార్దన వచనకవిగా, పద్య కవిగా ప్రసిద్ధులు. ఆయన రచించిన విజయక్రాంతి సంగీత రూపకం పుస్తకాన్ని 1974లో నవోదయ సాహితీ సమితి కొల్లాపురం సంస్థ ప్రచురించింది. ఆనాటి భయంకరమైన కరువు బీభత్సాన్ని గేయరూపకంగా అన్ని గ్రామాల్లో ప్రదర్శించారు. కరువు పీడిత ప్రాంతం నుంచి ఎదిగొచ్చి, చదువుకొని తన శ్రామికవర్గ స్పృహను, రైతు వెతలను వదలకుండా రాసిన మొదటి రచన ఇది.*

విజయక్రాంతి పుస్తకం ఇప్పుడు ఎక్కడా అందుబాటులో లేదు. అందుకే ఇటీవల దాన్ని మరోసారి ముద్రించారు. జనవరి 7న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ పుస్తకావిష్కరణ జరిగింది. ఇక పుస్తకం విషయానికొస్తే.. ఈ పుస్తకానికి పల్లవి అనే పేరుతో డాక్టర్ జీవీ సుబ్రహ్మణ్యం ముందుమాట రాశారు. భావ పల్లవి అంటూ కవి తన మాటను రాశారు.

> **1974లో అప్పటి పల్లెటూర్లలో కనిపించే రాజకీయ కక్షల పరిణామాలను ఇందులో విపులంగా చిత్రించారు. కరువు, అప్పులు, వడ్డీలు, మిత్తి, పెత్తందారు నాగులు దౌర్జన్యాలపై గేయ నాటకాన్ని రాసి గ్రామాల్లో ప్రదర్శించారు. పద్యగేయ రూపకంగా నాటకాన్ని రాయడం కత్తిమీద సామే. పాత్ర పలికిన ప్రతిమాట మాత్రాబద్ధం కావాలి. ధనమదాంధ దౌర్జన్యానికి వ్యతిరేకంగా శాంతి, సమానత్వం, సమ సమాజమే మార్గంగా, శ్రేయోరాజ్య స్థాపనగా దేశభక్తిని ప్రకటించిన ప్రబోధమే ఈ గేయరూపక విజయక్రాంతి.**

సామాజిక వ్యవస్థను చిత్రించే ఏ రచన అయినా సామాన్యులకు అందుబాటులో ఉండేటట్టుగా ఆయా పదాల మాండలికాలలో కొనసాగే రచన శాశ్వతంగా నిలుస్తుంది. కథావస్తువు బలంగా లేకపోతే నాటకం రక్తికట్టడం కష్టమవుతుంది. కథనం వినసొంపుగా ఉంటే ప్రజలు అద్భుతంగా పాడుకుంటారు. ఇందులోని కథలు కూడా సహజంగా, వాస్తవాలకు దగ్గరగా.. ఊహలకు, కల్పితాలకు తావివ్వకుండా ఉంటాయి. రామాపురం అనే గ్రామంలో తన కల్లంకాడ రైతు రామిరెడ్డి, పెత్తందారు నాగరాజు, గుమస్తా శేషయ్యల మధ్య జరిగే సంభాషణలు అప్పటి పరిస్థితులను కండ్లకు కడతాయి. విజయక్రాంతిలోని గేయాలు మానవ హృదయాల్ని ద్రవింపజేస్తాయి. రైతు కష్టాలపై చేసిన రచన అలలమీద పడవలా సాగుతది. రైతు రామిరెడ్డి తాను పండించిన ధాన్యాన్ని తరలించకుండా.. గుమస్తా శేషయ్య అడ్డుపడి, రైతును కొట్టి ఆ ధాన్యాన్ని ఎత్తుకుపోయే సన్నివేశాన్ని చూస్తే మన కండ్ల వెంట కన్నీళ్లు వస్తాయి.



ఏడు దృశ్యాలుగా సాగిన ఈ కావ్యంలో..
*సోదరులారా కదలండి*
*సోమరులై చెడిపోకండి*
*జనశక్తిని రుచి చూపిద్దాం*
*ధనస్వామ్యపు పస తేల్చేద్దాం*
*సామ్యవాదమును సాధింతాం*
*శ్రమజీవిని అభిషేకింతాం*
*జగతికి సుఖముల పంచేద్దాం*
*ప్రగతికి బాటలు వేసేద్దాం*
*పెత్తందారుల పెద్దరికం*
*గుత్త పెట్టుబడి చదరంగం*
*బూర్జువాయిజం దౌర్జన్యం*
*భువి లేకుండగ చేసేద్దాం*
*గ్రామ రాజ్యమును నిర్మింతాం*
*రామరాజ్యమును స్థాపింతాం*
*సమాన హక్కుల సాధింతాం*
*శాంతి సమతలను వెలయింతాం...*
అని సాగే గేయం ఎందరినో కదిలించింది.

ఒక సందర్భంలో సర్పంచ్‌గా ఎన్నికైన రమేష్‌ను పెత్తందారు నాగరాజు హత్య చేయించగా.. ఆ వార్త విని గ్రామమంతా కుప్పకూలిపోతుంది. ఆత్మీయులంతా విలపిస్తారు. అప్పుడు ఊరు శోకగీతమై విలపిస్తుంది. ఆ గీతం ఇలా సాగుతుంది..

> మన బ్రతుకుల వెలుగు రేక
> మానవతకు నవ ప్రతీక
> ఆరిపాయె కన్నీరె మిగిలె
> మన ప్రాణము మన నెయ్యము
> మనకు దూరమాయెనయ్య
> ధనదానవ క్రూరదంష్ట్ర...

నూనూగు మీసాల నూతన యవ్వనంలో 20 ఏండ్ల వయస్సులో వల్లభాపురం జనార్దన రాసిన ఏడు దృశ్యాల గేయ రూపకమే విజయక్రాంతి. ఆనాటి గ్రామ పంచాయతీ ఎన్నికలు, రాజకీయాలు, కక్షలు, సాంఘిక అసమానతలు, రైతుల దీనస్థితుల సమాహారమే విజయక్రాంతి.

చాలాచక్కగా, చిక్కటి కవిత్వమై ఛందోబద్ధమై సాగిన విజయక్రాంతి ఇప్పటికీ, ఎప్పటికీ ఒక చైతన్య క్రాంతి. ఆనాడు ఉన్న పరిస్థితే నేడూ వివిధ రూపాల్లో కనిపిస్తూనే ఉన్నది. నిరసనలు, ఉద్యమాలు నడుస్తూనే ఉన్నాయి. ఢిల్లీలో నిరసన చేస్తున్న రైతులను అణచివేస్తున్న దృశ్యాలు మనకు కనిపిస్తూనే ఉన్నాయి. అలాంటి ఘటనలపై ఎనభై ఏండ్ల వయసులోనూ వల్లభాపురం జనార్దన ప్రజల పక్షాన కవితలు, పద్యాల రూపంలో తుపాకీని ఎక్కుపెడుతూనే ఉన్నారు. ఆయన రచించిన రచనలు 'పహారా కాస్తున్న రాత్రి', 'విష కౌగిలి', 'యుగపతాక శ్రీశ్రీ దీర్ఘ కవితలు' సమగ్రంగా వచ్చినట్టయితే నేటి యువతరానికి, నవతరం సాహితీ అభిలాషులకు ఎంతో స్ఫూర్తిగా నిలుస్తాయి.



వనపట్ల సుబ్బయ్య

*అరక కట్టినప్పుడు ఎడమవైపు ఉండే ఎద్దును దాపటెద్దు అని అంటారు. దాపట, దాపల అనే పదాలకు ఎడమవైపు అని అర్థం. నాగలి సాలు వంకర లేకుండా చక్కగా ఉండాలంటే ఎడమవైపు ఉండే ఎద్దు హుషారుగా, ఓపికగా, తెలివిగా ఉండాలి. కుడి వైపునున్న ఎద్దు కాస్త పక్కకు జరిగితే.. ఎడమవైపు పగ్గం వేసి ఉన్న ఎద్దు దాన్ని అదుపులో పెడుతూ పొలంలో నాగలి సాళ్లన్నీ సక్రమంగా వచ్చేందుకు దోహదపడుతుంది.*

# కృషీవలుడి పెద్దకొడుకు.. దాపటెద్దు

దేశానికి వెన్నెముక రైతన్న. దేశానికి అన్నం పెట్టే హాలికుడికి దాపటెద్దు కుడి భుజం లాంటిది. ఈ ఎద్దుకు తాడు కట్టి, దాన్ని చేతిలో పట్టుకొని శబ్దం చేస్తూ, అదిలిస్తూ నాగలి దున్నుతాడు రైతన్న. ఇంటికి పెద్దకొడుకు వలె, రైతన్నకు వ్యవసాయంలో సహాయపడే రాముడు అనే ఎద్దు కథే దాపటెద్దు. కవి, రచయిత భైతి దుర్గయ్య హృద్యంగా మలిచారు ఈ కథను. 22 కథల సమాహారమే దాపటెద్దు పుస్తకం.

పల్లెటూరి జీవితాలను ఈ పుస్తకంలో కండ్లకు కట్టినట్టు చూపించారు రచయిత. పాలేరుగా ఊడిగం చేయడం కంటే, బాగా చదివి ఉద్యోగం సాధించాలనే కసితో ఒక పసివాడు ఎదిగిన విధానాన్ని 'పసివాడి చదువు'లో రచయిత చక్కగా ఆవిష్కరించారు. తమ్ముడి చదువు కోసం అక్క చేసిన త్యాగం ఆకట్టుకుంటుంది. ఉద్యోగం సంపాదించాక 'ఈ జీవితం, హోదా నువ్వు ఇచ్చిన భిక్షే' అని అతను తన అక్కతో చెప్తుంటే మన కండ్లు చెమ్మగిల్లుతాయి. మానవత్వం మంట గలుస్తున్న ప్రస్తుత రోజుల్లో.. తప్పిపోయిన ఒక మూగజీవి కోసం తపనపడే బీరప్ప వ్యథ 'గొర్రె పిల్ల' కథలో మనకు కనిపిస్తుంది.

హృదయాన్ని కదిలించే మరో కథ దాపటెద్దు. పైన చెప్పినట్టు.. రైతన్నకు వ్యవసాయంలో సాయం చేసే రాముడు అనే ఎద్దు కథే ఈ దాపటెద్దు. ఈ కథ శీర్షికే పుస్తక శీర్షికగా మారింది. ఎద్దుతో రైతు కుటుంబానికున్న అనుబంధం బాగుంటుంది. ఒకానొక సమయంలో కరువుకు తాళలేక రైతు వలస వెళ్లాలని అనుకుంటాడు. ఎద్దును గోశాలకు తరలిస్తాడు. రాముడిని వదులుకోలేక కుటుంబ సభ్యులందరూ బాధపడుతుండటంతో రైతన్న వలస వెళ్లాలన్న ఆలోచనను విరమించుకుంటాడు. వెంటనే రాముడిని మళ్లీ ఇంటికి తీసుకొస్తాడు. రాముడిని గోశాలకు సాగనంపేటప్పుడు రైతు, అతని కుటుంబ సభ్యులు పడే బాధ వర్ణనాతీతం. మూగజీవులను రైతన్న ప్రేమించడం, వాటిని దూరం చేసుకుని పరితపించడం, మూగజీవులపై అన్నదాతలకు ఉండే ప్రేమను చక్కగా వివరించారు కవి.

చదువు నేర్పిన గురువు గురించి, భార్యాభర్తల మధ్య బంధం గురించి.. ఇలా ఇందులో ఉన్న ప్రతి కథ మనల్ని కదిలిస్తుంది. రచయిత దుర్గయ్య కలం నుంచి జాలువారిన ప్రతి కథ వృత్తాంతం మన చుట్టూ జరుగుతున్నటువంటి సమకాలీన అంశాలే. అందుకే ఇవి మనల్ని ఆలోచింపజేస్తాయి. ఇలాంటి కథలు నేటి సమాజానికి అవసరం.

- యాడవరం చంద్రకాంత్ గౌడ్
99085 16549

**ప్రకటన**

### 'కూడలి చెట్టు' ఆవిష్కరణ

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 25న (ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు) నల్లగొండ రమేష్ రచించిన కవితా సంపుటి 'కూడలి చెట్టు' పుస్తకావిష్కరణ సభ జరగనున్నది. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు, ఆసిఫాబాద్ కవుల సంఘం( ఆకసం), తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభకు కందుకూరి శ్రీరాములు అధ్యక్షత వహిస్తారు. నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కె.శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. మామిడి హరికృష్ణ, నాళేశ్వరం శంకరం, మాడుగుల నారాయణమూర్తి, బెల్లంకొండ సంపత్ కుమార్, గుర్రాల వెంకటేశ్వర్లు, దరిపెల్లి కృష్ణమాచార్యులు, ఉదారి నారాయణ ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు.

### తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర మహాసభలు

హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 25న తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. ఈ సదస్సు ప్రారంభకులుగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, సాహితీ విమర్శకులు కె.శ్రీనివాస్, ప్రముఖ కవి అందెశ్రీ, పాత్రికేయులు నగునూరి శేఖర్ పాల్గొంటారు. ఆచార్య జయధీర్ తిరుమలరావు, జూకంటి జగన్నాథం, ఆచార్య కాత్యాయనీ విద్మహే, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, ఉదారి నారాయణ తదితరులు వక్తలుగా హాజరవుతారు. తెలంగాణ భాషా సాహిత్య సంస్కృతులు ఎదుర్కొంటున్న సవాళ్లు – పరిష్కారాలు, తెలంగాణ కవులు, రచయితల కర్తవ్యాలపై సదస్సులో చర్చించనున్నట్టు తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బూర్ల వేంకటేశ్వర్లు తెలిపారు.